తెలుగు డిజిటల్ న్యూస్
సిరి ...People Voice
విలేకరులు కావలెను
మొదటి సారిగా ఉమ్మడి మెదక్ జిల్లా కోసమే ప్రారంభమై ప్రాంతీయ వార్తలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న
సిరి దిన పత్రిక మరియు చానెల్ కు జిల్లా, నియోజకవర్గ మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను.
ఎటువంటి యాడ్స్ టార్గెట్ ఉండదు నెల నెల డబ్బులు కట్టాల్సిన అవసరం లేదు.
కేవలం నిర్భయంగా, నిర్మోహమాటంగా అవినీతి, అభివృద్ధి పై ప్రజా కోణంలో ధైర్యంగా
వార్తలు రాయగలిగే విలేకరులు కావలెను.
సిరి TV ...People Voice
ఫోన్ నెం : 99897 78881, 9697 88 99 22

www.siridaily.com
తెలుగు డిజిటల్ న్యూస్
# సిరి
...People Voice
గురువారం, డిసెంబర్ 19, 2024 | సంపుటి-1 సంచిక-8 పేజీలు - 4



## నాణ్యమైన భోజనం అందించాలి

- డైట్ మెనూ అమలు చేయాలి
- విద్య, వైద్యానికి ప్రాధాన్యత
- నిరంతరం ఆకస్మిక తనిఖీలు ఉంటాయి
- ఏదేని లోపం వస్తే కఠిన చర్యలు తప్పవు
- పాఠశాల పరిసరాలలో పరిశుభ్రత పాటించాలి
- హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

వివరాలు 4లో

## సుస్థిర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- డీఈవో రాధాకిషన్
- తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్
- పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక

3

- 2023లో ముగిసిన పాలవర్గం గడువు
- ఇన్ చార్జి ఈవోతోనే కేతకి ఆలయ పర్యవేక్షణ
- సౌకర్యాలు కరువై భక్తులు ఇబ్బందులు
- నూతన పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ రిలీజ్
- చైర్మన్ పదవికోసం జోరుగా ఆశావహుల పైరవీలు
- మంత్రి దామోదర ఆశీస్సులు ఎవరికో ?
- ఎంపీ అండదండల కోసం ప్రయత్నాలు

వివరాలు 2లో

అష్టతీర్థమాల సంగమం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెంది భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి పదవుల కోసం అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు పైరవీలు మొదలు పెట్టారు. కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ పాలకవర్గ పదవులకు తీవ్ర పోటీ పెరిగింది. కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ, ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి ప్రతి ఏడాది వివిధ రూపాల్లో రూ 4 కోట్ల ఆదాయం వస్తుంది. గత ఎడాది అక్టోబర్‌లో పాలకవర్గ పదవీకాలం ముగియగా ఇప్పటివరకు కొత్త పాలకవర్గం ఏర్పాటు కాలేదు. దీంతో కేతకి ఆలయంలో సౌకర్యాలు కరువై భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 13 నెలల పాటు ఇన్చార్జ్ ఈవోతోనే కేతకి ఆలయ పర్యవేక్షణ కొనసాగుతూ వచ్చింది. నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.. చైర్మన్ పదవి కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతుంది. కేతక పీఠం ఎవరికో? అనే దానిపై సిరిన్యూస్ ప్రత్యేక కథనం.

సిహెచ్. మహేశ్
ఝరాసంగం - సిరి న్యూస్

# కేతకి పీఠం ఎవరికో?




## చైర్మన్ సీటు కోసం తీవ్రపోటీ

# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

- ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే క్యూఆర్ టీం రాక
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

4



## సోషల్ మీడియాలో ప్రేమాయణం!

- పెళ్ళయిన 20 రోజుల్లోనే మృత్యుఒడికి
- పీర్లపల్లిలో విషాదం



3

## నేరాల నియంత్రణకై కార్డన్ సర్చ్

సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



4

## చేపల వేటకు వెళ్లిన యువకుడు మృతి



**కొల్చారం, డిసెంబర్ 18(సిరిన్యూస్)** చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి శివారులోని ఏడుపాయల మంజీరా వాగు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జలగం ఏసు(36) ఈనెల 16వ తేదీన చేపల వేట కోసం వెళ్ళి తిరిగి రాకపోవడంతో సమీప ప్రాంతాల్లో వెతుకుతుండగా.. మంజీరా నది వద్ద ఓ గుండు పై మృతి చెంది ఉండడం గమనించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే మృతునికి ఫిట్స్ వచ్చేవని గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

**కొల్చారం, డిసెంబర్ 18(సిరిన్యూస్)** రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కొల్చారం లోతువాగు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్.ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన స్వప్న(26), శ్రీను బుధవారం ద్విచక్ర వాహనంపై నర్సాపూర్ నుండి మెదక్ వైపు వెళుతున్న క్రమంలో అదుపు తప్పి డివైడర్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వప్న మృతి చెందగా శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మంభోజిపల్లి శివారులో యువకుడు హత్య

**మెదక్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** మెదక్ జిల్లా కేంద్రం సమీపంలోని మంభోజిపల్లి గ్రామ శివారులోని పసుపులేటి బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మంభోజిపల్లి పసుపులేటి బ్రిడ్జి వద్ద యువకుడి శవం ఉన్న సమాచారంతో మెదక్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 25 ఏళ్ళ వయస్సు ఉన్న యువకుడు హత్యకు గురైనట్లు గుర్తించారు. మృతుడి తల పగిలి రక్తం కారుతోంది. యువకుడితో పాటు వచ్చిన వారే బండరాయితో కొట్టి చంపి ఉంటారని భావిస్తున్నారు. దీంతో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్.ఐ మురళీ వచ్చి పరిశీలించారు. మృతుడు ఎవరనేది ఇంకా తెలియలేదని, పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి డాక్టర్ మోహన్ ఆర్థిక సహాయం

**రామాయంపేట, డిసెంబర్ 18(సిరిన్యూస్)** రామాయంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన బాదావత్ రాజు ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ తాండకు వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ఐదు వేల రూపాయల నగదు, నిత్యవసర సరుకులు, 25 కిలోల బియ్యం అందించడం జరిగింది. మృతుని పిల్లలకు చదువు కోసం ఆర్థిక సహాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇలాంటి విషయం ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ గుగులోతు సురేష్‌నాయక్, బన్సీలాల్, పాండు, నరేందర్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



# కేతకి పీఠం ఎవరికో?



- పాలక మండలి నోటిఫికేషన్ రిలీజ్
- జోరుగా ఆశావహుల పైరవీలు
- మంత్రి దామోదర ఆశీస్సులు ఎవరికో ?
- ఎంపీ అండదండల కోసం ప్రయత్నాలు

**ఝరాసంగం -సిరి న్యూస్** కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి పదవుల కోసం అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు పైరవీలు మొదలు పెట్టారు. కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ, ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఎడాది అక్టోబర్ లో పాలకవర్గ పదవీకాలం ముగియగా ఇప్పటివరకు కొత్త పాలకవర్గం ఏర్పాటు కాలేదు. దీంతో కేతకి ఆలయంలో సౌకర్యాలు కరువై భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 13 నెలలపాటు ఇన్చార్జ్ ఈవో తోనే కేతకి ఆలయ పర్యవేక్షణ కొనసాగుతూ వచ్చింది. కేతకి ఆలయానికి మన రాష్ట్రం తో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. మహాశివరాత్రి, దసరా ఉత్సవాలు, వేసవి సెలవులలో, వివాహ శుభకార్యాలలో, శ్రావణమాసం, కార్తీక మాసం, సోమవారం, అమావాస్య తో పాటు, ఇతరత్రా సెలవులలో కేతకి ఆలయం భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఏటా రూ 4 కోట్ల వరకు ఆదాయం వచ్చే ఆలయానికి కొత్త పాలక మండలి నియమించకపోవడంతో ఇక్కడి సమస్యలు అక్కడే పేరుకు పోతున్నాయి. కేతకి ఆలయానికి చెప్పుకోదగ్గ ఆదాయం వస్తున్న ఇంతవరకు ఆలయ చైర్మన్లుగా పనిచేసిన పాలకమండలి సభ్యులు అరకొరగానే అభివృద్ధి చేశారని ఆరోపణలు ఉన్నాయి. కేతకి ఆలయ అభివృద్ధికి పాటుపడే వారికే ఆలయ చైర్మన్ పదవిని కట్టబెట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేతకి ఆలయంలో సిబ్బంది కొరత తో పాటు,రెగ్యులర్ ఈవో లేకపోవడం సమస్యగా మారింది. జూనియర్ సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంతకాలం ఇన్చార్జి ఈవో తోనే నెట్టుకు వస్తున్నారు. కనీసం ఇప్పుడైనా ఏర్పడే కొత్త ఆలయ పాలకవర్గం చైర్మన్,ఆలయ ధర్మకర్తలు, ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టి,రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకురావాలని కేతకి ఆలయ భక్తులు కోరుతున్నారు.

### ఇప్పటి వరకు పనిచేసిన చైర్మన్లు..

1969 నుంచి ఏడుపర్యాయాలు ఎంపీగా, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన బాగారెడ్డి 1969-1971 వరకు కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా పనిచేశారు. ఆ తర్వాత ఝరాసంగం మండల మాజీ ఎంపీపీ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ తండ్రి సంగప్ప పాటిల్ 1971-1975 వరకు నాలుగు పర్యాయాలు ఆలయ చైర్మన్ గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత మల్లికార్జున్ పాటిల్ రెండు పర్యాయాలు, బోరేగావ్ గ్రామానికి చెందిన హనుమన్న పాటిల్ రెండుమార్లు, ఝరాసంగం కు చెందిన బస్వరాజ్ పాటిల్, కుప్పానగర్ కు చెందిన మణయ్య షెట్కార్, కక్కర వాడకు చెందిన నరసింహారెడ్డి, గుంతమర్పల్లి గ్రామానికి చెందిన నర్సింహా గౌడ్, జహీరాబాద్ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నీల వెంకటేశం చైర్మన్లుగా వ్యవహరించారు..

### చైర్మన్ పదవి కోసం పెరుగుతున్న ఆశావాహులు..

కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్, ధర్మకర్త పదవుల కోసం ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. దీంతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కేతకి ఆలయ చైర్మన్ పదవి కోసం ఎక్కువమంది ప్రయత్నిస్తున్నప్పటికీ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ ఆశీస్సులు ఉన్న వారికే పదవులు దక్కనున్నాయి. కేతకి ఆలయ మాజీ చైర్మన్ దేవరంపల్లి గ్రామానికి చెందిన మల్లన్న పాటిల్ తనయుడు అశ్విన్ పాటిల్ కాంగ్రెస్ సీనియర్ నేత ఉజ్వల్ రెడ్డి ద్వారా మంత్రి దామోదర రాజనర్సింహ వద్ద ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. అశ్విన్ పాటిల్‌కు కాంగ్రెస్ సీనియర్ నేతల ఆశీర్వాదం ముమ్మరంగా ఉన్నట్లు సమాచారం. ఈదులపల్లి గ్రామానికి చెందిన శేఖర్ పాటిల్ మంత్రి ద్వారా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. శేఖర్ పాటిల్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలోనూ చురుకైన పాత్రను పోషించి, జహీరాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గురించి పగలు రాత్రి అనకుండా కష్టపడి పని చేశాడనే అభిప్రాయం ప్రజల్లో బాగా ఉంది. కచ్చితంగా తనకే చైర్మన్ పదవి కాంగ్రెస్ అధిష్టానం ఇస్తారనే నమ్మకంతో ఆయన ఉన్నట్లు సమాచారం. ఝరాసంగం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మల్లయ్య స్వామి కేతకి ఆలయ చైర్మన్ పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా ఉండే, కాంగ్రెస్ పార్టీకి కష్ట కాలంలో ఎనలేని సేవలు అందించిన మల్లయ్య స్వామికి కేతకి ఆలయ చైర్మన్ పదవి దక్కి అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి. కమాల్ పల్లి మాజీ సర్పంచ్ సంగ్రం పాటిల్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ బసవరాజ్ పాటిల్, ఎల్గోయి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు వీర్ శెట్టి జహీరాబాద్ ఎంపీ ద్వారా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కేతకి సంగమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవి కోసం ఎవరికివారు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

## మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదు

- బఫెలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వేణు గోవిందరాజు

**పటాన్‌చెరు, డిసెంబర్ 18(సిరిన్యూస్)** లక్షల సంవత్సరాల పరిణామ ప్రక్రియల ద్వారా రూపొందించబడిన లక్షణం, సందర్భాన్ని బట్టి క్రియాశీలంగా వ్యవహరించే ప్రత్యేక సామర్థ్యాన్ని మానవులు కలిగి ఉన్నారని, దీనికి విరుద్ధంగా డేటాసెట్ లపై కృత్రిమ మేథ ఆధారపడి అనుకరించే సామర్థ్యానికి పరిమితమవుతోందని అమెరికాలోని బఫెలో విశ్వవిద్యాలయ పరిశోధన, ఆర్థికాభివృద్ధి విశిష్ట ఆచార్యుడు డాక్టర్ వేణు గోవిందరాజు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ వికాసం: మానవ భాషా కమ్యూనికేషన్ పై దృక్కోణం' అనే అంశంపై బుధవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. చెక్ లిస్టులు, పరీక్షలు, పరిశీలనలతో కృత్రిమ మేథ మనకు సాయపడుతున్నప్పుడు, మానవ ఆలోచన యొక్క సంక్లిష్టతను ప్రతిబింబించడంలో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. కృత్రిమ మేథ రంగంలో నిపుణుడైన ఆయన, ముఖ్యంగా మానవ భాషా కమ్యూనికేషన్ రంగంలో తన లోతైన అవగాహనను అందించారు. చేతి వ్రాత గుర్తింపులో డాక్టర్ వేణు మార్గదర్శక పని, అమెరికా పోస్టల్ సర్వీస్ ఉపయోగించే మొదటి చేతివ్రాత చిరునామా వివరణ




వ్యవస్థ అభివృద్ధికి దారితీసింది. దాదాపు వంద మిలియన్ డాలర్ల ప్రాయోజిత ప్రాజెక్టులకు ఆయన నాయకత్వం వహించడంతో పాటు ఆరు పేటెంట్లు, 460 పరిశోధక పత్రాలను ప్రచురించి, పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. మేధస్సు అనేది సహజంగానే సామాజికమైనది, పరస్పరం ఆధారపడి ఉంటుందని స్పష్టీకరించారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి అతిథిని స్వాగతించగా, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సత్కరించారు. ఈ ఆతిథ్య ఉపన్యాసం తరువాత డాక్టర్ వేణు గీతంలోని డైరెక్టర్లు, విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులతో ముఖాముఖి చర్చించారు. ఆ తరువాత సైబర్ ఫోరెన్సిక్, నెట్ వర్క్స్ ప్రయోగ శాలలు, జీఎలక్ట్రా, టీఈపీఈ, ఏరోమోడలింగ్ ల్యాబ్ లను సందర్శించడమే గాక, ఇంజనీరింగ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ లను కూడా పరిశీలించారు.

## సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలి

- మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

**వెల్దుర్తి, డిసెంబర్ 18(సిరిన్యూస్)** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ సర్పంచుల పెండింగ్ బిల్లులు రావడం లేదని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు అశోక్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్నా ఇప్పటికీ డెవలప్మెంట్ గ్రామాల్లో చేసిన ఎస్డిఎఫ్ , ఈజీఎస్ , 15 ఫైనాన్స్ పనులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో పెండింగ్ బకాయిలు ఉన్నాయని వాటికి సంబంధించి వడ్డీలు కట్టలేక మాజీ సర్పంచులు ఎంతో ఇబ్బందికి గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి మండలంలో గల ప్రతి గ్రామ పెండింగ్ బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.



# ఆటో డ్రైవర్ల వేషధారణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

▪ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డ్రైవర్ల వేషధారణలో అసెంబ్లీకి వెళ్లారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ అసెంబ్లీలో వాయిదా తీర్మానం పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని వాయిదా తీర్మానం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఏడాదికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# సుస్థిర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• డీఈవో రాధాకిషన్

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 18(సిరిన్యూస్)** మెదక్ ప్రభుత్వ స్థానిక ఉన్నత పాఠశాల నందు బుధవారం తెలంగాణ బయోసైన్స్ ఫోరం మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రము, జీవశాస్త్రం పట్ల అత్యధిక శ్రద్ధ కనబరచాలని, జీవశాస్త్ర అంశాలను జీవితంలో అన్వయించుకొని, సుస్థిర అభివృద్ధిలో భాగస్వాములై ప్రగతి కి తోడ్పాడాలని కోరారు.అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థా యి నుంచి భవిష్యత్తులో మన జీవితాలను సులభతరం చేసే విధంగా నూతన ఆవిష్కరణల వైపుకు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు.అప్పుడే ప్రభుత్వ పాఠశాలల నుండి భావిశాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు. ఇప్పుడున్న సమాజంలో విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలంటే, టాలెంట్ టెస్టులో పాల్గొనడం వల్ల, భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలలో అనుభవం పొందడం జరుగుతుందని మెదక్ జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షులు దొంతి ప్రసన్నకుమార్ తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతల వివరాలను జిల్లా విద్యాధికారి మరియు



జిల్లా సైన్స్ అధికారి కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం మెదక్ జిల్లా అధ్యక్ష్యులు దొంతి. ప్రసన్న కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు నరేందర్,జిల్లా AMO సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీఎంవో సతీష్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కోశాధికారి రమణ కుమార్,జిల్లా కమిటీ సభ్యులు అరుణ, అశోక్ కుమార్, చంద్రశేఖర్, శ్రవణ్, మాధురిక, ఉమామహేశ్వర్, రాష్ట్ర బాధ్యులు లింగ ప్రసాద్, మల్లేశం పాల్గొన్నారు. కాగా టాలెంట్ టెస్టులో తెలుగు మీడియం విభాగంలో ప్రథమ స్థానం హారిక, ద్వితీయ స్థానం ఎస్.భానుప్రియ, ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రథమ స్థానం జి.నందిని, ద్వితీయ స్థానంలో సిద్ర తస్నీమ్ నిలిచి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్ కి ఎంపిక కావడం జరిగింది.

# సెంట్రల్ జైలు తనిఖీ

• న్యాయ సేవాధికార కార్యదర్శి రమేశ్

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,బి.రమేష్ కందిలోని సెంట్రల్ జైలును తనిఖీ చేశారు. సెంట్రల్ జైలులోని బ్యారక్, గదులు, వంట గది, బాత్రూంలు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించి ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కావాల్సిన అవసరాలు,



సదుపాయాలు అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూసి కూరగాయలు, బియ్యం ఉన్న రూమ్ ని కూడా తనిఖీ చేశారు. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించడం జరిగింది. ఈ తనిఖీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ , జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ప్రేమాయణం!

• పెళ్ళయిన 20 రోజుల్లోనే మృత్యుఒడికి

• పీర్లపల్లిలో విషాదం

**జగదేవపూర్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** సోషల్ మీడియాలో సాగిన ఇద్దరి ప్రేమాయణం పెళ్లి వరకు చేరి గత 20 రోజుల క్రితం పెళ్లి చేసుకొని ఇరవై రోజుల్లోనే వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా మోసర మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శృతి (22) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన దయాకర్ అనే యువకుడి తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. మృతురాలు శృతి ఒక ప్రముఖ గాయని. ఫోక్ సాంగ్స్ పాడుతూ హైదారాబాద్ లో ఉండేది. ఇదే క్రమంలో దయాకర్ తో ప్రేమలో పడి తరచూ దయాకర్ స్వగృహం అయినా పీర్లపల్లి వస్తూ ఉండేది. ఇద్దరి తల్లిదండ్రులను ఒప్పించి



వివాహం చేసుకోవాలని చూడగా శృతి తల్లిదండ్రులు ఈ వివాహానికి ఒప్పుకోకపోవడంతో ఇద్దరు కలిసి గత ఇరవై రోజుల క్రితం దయాకర్ స్వగృహంలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. హఠాత్తుగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రుతి అనుమానాస్పదంగా మృతి చెందటంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న మృతురాలి బంధువులు బోరున విలపిస్తూ ఆమె ఆత్మహత్య చేసుకోలేదని ఆమె భర్తే తనని చంపేశారని ఆరోపిస్తుండగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**రామాయంపేట, డిసెంబర్ 18 (సిరిన్యూస్)** రామాయంపేట మండల కేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ గురు స్వామి, మర్కు నగేష్ గురుస్వాముల ఆధ్వర్యంలో రామాయంపేట పట్టణానికి చెందిన హర్ష కన్నె స్వామి అయ్యప్ప మహా పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు, అయ్యప్ప భజన సంకీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, అయ్యప్ప నామస్మరణతో దేవాలయ ప్రాంగణం అంతా మారు మ్రోగిపోయింది. అనంత రం 18 మెట్ల పడి వెలిగించి అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణమూర్తి గురు స్వామితో పాటు అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, పట్టణ భక్తులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన

**కొల్చారం, డిసెంబర్ 18(సిరిన్యూస్)** తక్కువ పెట్టుబడి, నీటి సామర్థ్యంతో ఎక్కువ లాభదాయకమైన ఆయిల్ ఫామ్ తోటల పెంపకం వైపు రైతులు దృష్టి సారించాలని హార్టికల్చర్ హెచ్‌వో సంతోష్, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ అన్నారు. బుధవారం కొల్చారం రైతు వేదికలో మెదక్ జిల్లా ఉద్యానవన శాఖ తరపున బంగారు జీవితానికి బాటలు వేసే ఆయిల్ ఫామ్ పంట పైన అవగాహన సదస్సు ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేత రైతులందరికీ ఈ పంటకు, డ్రిప్ కు సబ్సిడీ సదుపాయం ఉందని తెలిపారు. ఆయిల్ ఫామ్ గెలల ధర గత మూడు నెలల్లోనే టన్నుకు రూ.6 వేలకు పెరిగిందని తెలిపారు. అక్టోబర్ లో ఆయిల్ ఫామ్ ధర టన్నుకు రూ.19,144 ఉండగా, నవంబర్ నెలలో 1269 రూపాయలు పెరిగి రూ.20413 తెలంగాణ



ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా హెచ్‌వో సంతోష్, ఏవోఎం శ్వేతా కుమారి ఉద్యానవన శాఖ కొల్చారం మండల ఫీల్డ్ ఆఫీసర్ సుజాత, ఏఈవో వినిత భవాని, రైతులు ముత్యంగారి సంతోష్, జూలకంటి సంఘమేశ్వర్, నింగోళ్ల చెన్నయ్య, నింగోళ్ల కిష్టయ్య, సంజీవరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# లేబర్ ఆఫీసులో నామినేషన్ వేసిన శ్రీనివాస్ రెడ్డి

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 18 (సిరిన్యూస్)** విఎస్టి పరిశ్రమలో వర్కర్స్ యూనియన్ నంబర్-1 తరపున ఎన్ఎన్ఆర్ గ్రూప్ నుండి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎస్టీ పరిశ్రమలో గత ఐదుసార్లుగా తామే గెలిచామని 6వ సారి కూడా నామినేషన్ వేశామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ కార్మికుల శ్రేయస్సు కోసమే పనిచేసే తనను యూనియన్ కార్మికులందరూ లయన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. నామినేషన్ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, ప్రెసిడెంట్ సిల్వర్ స్టార్ బాబి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రవి యాదవ్ , సభ్యులు రాములు, కృష్ణ, శ్రీనివాస్, మధు, శంకర్, మధుసూదన్ పాల్గొన్నారు.



## వధువు వివాహానికి పుస్తె మట్టెల అందజేత

- మానవత్వం చాటుకున్న సంఘ సేవకుడు రాజిరెడ్డి

**రామాయంపేట, డిసెంబర్ 18(సిరి న్యూస్)** ఓ వధువు వివాహానికి గాను పుస్తె మట్టెలు అందజేసి మరోసారి తన మానవత్వాన్ని ప్రముఖ సంఘ సేవకుడు వెంకీ గారి రాజిరెడ్డి తన మానవత్వం చాటుకోవడం జరిగింది. రామాయంపేట మండల పరిధిలోని ఆర్. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సాత్విక వివాహానికి పుస్తె మట్టెలు అందించడం జరిగింది. గతంలో కూడా సంఘసేవకుడు రాజిరెడ్డి చాలామంది వధువు వివాహాలకు పుస్తె మట్టెలు అందించి తన ఔదార్యాన్ని చాటుకోవడం జరిగింది. రాజిరెడ్డి చేస్తున్న సేవకు గ్రామస్తులతో పాటు మండలంలోని చాలామంది ఆయనను కొనియాడడం జరుగుతుంది. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల ఎంతోమందికి ధైర్యం కలుగుతుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- హాజరైన కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్

**పటాన్ చెరు, డిసెంబర్ 18(సిరిన్యూస్)** పటాన్ చెరు మండలం లక్డారం గ్రామంలో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 16న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 23వ తేదీ వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన స్వామివారి కల్యాణోత్సవానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన హనుమంత సేవపై స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో స్థానిక నాయకులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

- మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 18(సిరిన్యూస్)**ఎవరైనా శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని నాలుగు క్యూఆర్టీ పార్టీలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితులలో పోలీస్ యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలను గురించి పలు సూచనలు చేసినారు. ఈ సంధర్బంగా ఎస్.పి మాట్లాడుతూ...జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం అని జిల్లా ఎస్.పి అన్నారు. జిల్లా పరిధిలోని సామాన్యుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్వేషాలను రెచ్చగొట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము, జిల్లాలో నేరాల నియంత్రణ, అదుపునకు మరియు నేరాల గుర్తింపు శాంతి భద్రతల సంరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని ఇందుకు అనుగుణంగా జిల్లాలో నాలుగు క్యూఆర్ టీంలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో బాగంగా బలగాలను విస్తృతంగా వినియోగించి శాంతిభద్రతల నిర్వహించడంలో, ఏదైనా నిరసనలకు వెంటనే స్పందించడంలో, కీలక సమయంలో పౌరుల భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. జిల్లాలో ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు సంభవిస్తే వెంటనే స్పందించేందుకు క్యూఆర్‌టీ బృందాలు వ్యూహాత్మకంగా నివారించడానికి కేటాయించబడ్డాయన్నారు. ఎవరైనా చట్టవిరుద కార్యకలాపాలను నిర్వహిస్తుంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు, డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 కు తెలిపాలన్నారు.

# నాణ్యమైన భోజనం అందించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 18(సిరిన్యూస్)** హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రభుత్వం సూచించిన డైట్ ను ఇవ్వాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నిర్వాహకులను ఆదేశించారు. అందులో భాగంగానే బుధవారం మెదక్ పట్టణంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందిస్తున్న వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గది, స్టోర్ రూం, డైనింగ్ హాల్ లను, విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం ను పరిశీలించి, కామన్ డైట్ మెనూని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం డైట్ చార్జీ లు పెంచిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే కామన్ డైట్ అమలు చేస్తున్నదని, రోజు వారి అందించే డైట్ వివరాలు ఫ్లెక్సీ ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏదేని లోపం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



## ఖోఖోలో శివంపేటకు ప్రథమ బహుమతి

- అభినందించిన నవీన్ గుప్తా

**శివంపేట్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ ఖోఖో పోటీలలో పాల్గొని మొదటి బహుమతి గెలుపొందిన శివంపేట మండల కేంద్రానికి చెందిన జట్టు సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో కూడా మొదటి బహుమతి గెలుపొందాలని, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. క్రీడా ఉపాధ్యాయులు బాసంపల్లి శ్రీకాంత్ గౌడ్ , పివిజ్ఞి యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షకు ఎస్‌జీటీయు మద్దతు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** గత 12 రోజులుగా దీక్ష చేపడుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా శాఖ పక్షాన సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఆకుల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వీరి ప్రధాన డిమాండ్లు అయిన రెగ్యులరైజేషన్ , పే స్కేల్, ప్రతి ఎస్ఎస్ఏ ఉద్యోగి కి జీవిత బీమా, ఆరోగ్య భీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య , రాష్ట్ర నాయకులు అమృత, జహీరాబాద్ మండల అధ్యక్షులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకై కార్డన్ సర్చ్

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 18(సిరిన్యూస్)** సంగారెడ్డి డీఎస్పీ ఆధ్వర్యంలో వంద మంది పోలీసులతో సంగారెడ్డి పట్టణంలోని నారాయణ రెడి కాలనీలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ ప్రోగ్రామ్ (కారన్ సర్చ్) నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఈ తనిఖీలో ఒక అనుమానిత వ్యక్తితో పాటు, 42 బైకులు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సంగారెడ్డి టౌన్, నారాయణరెడ్డి కాలనీని 100 మంది పోలీసులతో చుట్టూ ముట్టి లోపలి వ్యక్తులు బయటకు వెళ్ళకుండా, బయటి వ్యక్తులు లోపలికి రాకుండా ఒక కంచె లాగా ఏర్పాటు చేసి, ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. సంగారెడ్డి పట్టణంలో గల వివిధ పరిశ్రమలలో పని చేయడానికి ఇతర రాష్ట్రాల నుండి ఉపాధికి వచ్చే మైగ్రేట్ లేబర్ అధిక సంఖ్యలో నివాసం ఉంటారని, సరైన గుర్తింపు కార్డ్ లేని వ్యక్తులను, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలని, అసాంఘీక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీసు శాఖ నెంబర్ 8712656777, డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పట్టణ ఇన్స్పెక్టర్ రమేష్, రూరల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, జోగిపేట సి.ఐ అనిల్, కొండాపూర్ సిఐ వెంకటేశం, సబ్‌డివిజన్ ఎస్ఐలు, ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.



Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.